# ముందుమాట

డబ్బు, సెక్స్ తర్వాత అత్యంత ఆకర్షణీయమైనది అందరూ ఆశించేది విజయమే. అందుకే విజయం గురించి పేవ్‌మెంటు పక్కన గారడి వాడు మాట్లాడినా నలుగురు చుట్టూ చేరతారు. ప్రజాదరణ పొందాలి అంటే, విషయం ఎంత గొప్పది, ఎంత బాగా చెప్పాలనే విశేషణాలు ముఖ్యం గాదు. జనానికి ఆసక్తి కలిగించే విషయాలు కాస్త చెప్పినా, పేలవంగా చెప్పినా కనీస ఆదరణ ఖఛ్చితంగా ఉంటుంది. అందుకే అందరూ ఆసక్తి చూపే విజయం వెనుక అనాసక్తి కలిగించే కర్మ ఉందనే రహస్యాన్ని బహిరంగ పరచాలని ఈ "**కర్మ జ్ఞానమే విజయ రహస్యం**" పుస్తకం రాయ సంకల్పించాను.

ఇది వ్యక్తిగత విజయానికే గాదు, కుటుంబ విజయానికి, తరతరాల వంశ పారంపర్య విజయానికి నాంది పలుకుతుంది. ఈ పుస్తకం చదివి సారాంశం జీర్ణించుకుని, జీవితంలోకి సాదారంగా ఆహ్వానించుకో గల్గితే.....కోరినంత డబ్బు వస్తుంది. శృంగార జీవితం సంపూర్ణంగా అనుభవించగల్గుతారు. స్నేహితులు బంధువులతో సంబంధాలు బాగుంటాయి. వైద్యుడితో అవసరం లేకుండా ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది. అసూయ, అహంకారం, ఆడంబరం లాంటి ప్రతికూల భావాలకు చోటు లేకుండా సంతోషంతో ఉంటారు. అనుకోకుండా ఏదైనా ఊహించని సంఘటన జరిగినపుడు నిబ్బరంతో ఎదుర్కొంటారు. చివరగా క్రీస్తు, అహమ్మదు, శ్రీకృష్ణుడు అన్ని మతాల దేవుళ్లు చెప్పే సారాంశం ఒకటేనన్న విశ్వ రహస్యం గ్రహిస్తారు.

***ఇక చదవండి మరి***

డల్లాస్. యు. ఎస్. ఏ. — **ఇట్లు**
ది. 06.06.2016 — **చండిక సాంబశివరావు**





## ముందుగా చదివి తీరాల్సిన సూచనలు :

☛ "కర్మ సిద్ధాంతం" మానవుని జీవితంలో ఎదురయ్యే సమస్త సమస్యలకు కారణం చెప్పటమే గాక పరిష్కారం కూడా చూపగల్గుతుంది,

☛ కారుతో పాటు "యూజర్ మాన్యువల్" ఉన్నప్పటికీ, పదేళ్ల బాలుడు కారును వినియోగించే సామర్థ్యం కలిగి ఉండనట్లే వయసుతోపాటు కనీస పరిణితి సాధించని చాలా మంది వయోజనులు ఈ పుస్తకాన్ని వినియోగించే సామర్థ్యం కలిగి ఉండరనేది యదార్థం. అలాంటి పాఠకులు ఎవరైనా పరిణితి చెందిన తమ బంధుమిత్రుల సాయంతో ఈ పుస్తక పఠనంలో ఎదురయ్యే అసౌకర్యాలను అధిగమించవచ్చును.

☛ చీకట్లో తడుముకుంటూ జేబులో ఉన్న అగ్గి పెట్టెను ఉపయోగించాలనే స్పృహను కోల్పోయిన విధంగా పరిణితి చెందిన విద్యాధికులైన పాఠకులకు కూడా ఒక్కోసారి పుస్తకంలోని సారాంశం అవసరానికి గుర్తురాదు. అందుకే ఈ పుస్తకాన్ని కథల పుస్తకంలా గాక పరీక్షలు రాసి పాసుగావాల్సిన పాఠ్యపుస్తకంలా చదవాలి.

☛ ఈ పుస్తకం చదవటానికి తొందరపడాలిగాని, చదవటం ప్రారంభించాక పేరాలు పేజీలు ఎగరగొట్టుకుంటూ "కథ" ఏమిటో తెలుసుకుందామనే తొందర చూపించకూడదు. ఎందుకంటే క్రమం తప్పి చదువుకుంటూ వెళితే గందరగోళానికి గురవటమేగాక వక్రంగా అర్థం చేసుకునే ప్రమాదముంది.

☛ ప్రశాంతమైన మనస్సుతో చదువుతున్న వాఖ్యాలను అర్థం చేసుకుంటూ బేరీజువేసుకుంటూ, సందేహం వచ్చిన చోట అర్థమయ్యేవరకు మీలో మీరు తర్కించుకుంటూ, అప్పటికీ సందేహం తీరని యెడల

అపనమ్మకం పెంచుకోకుండా, చిత్తంలో తటస్త విషయంగా నమోదు చేసుకొని చదవటం కొనసాగించాలి. ఆ పిమ్మట పెద్దలను, గురువులను సంప్రదించి చిత్తంలో భద్రంగా దాచిన తటస్త విషయాల పట్ల సందేహాలు తీర్చుకుని పూర్తిగా నిర్ధారించుకుని నమ్మకం కుదిరాకే విశ్వసించండి. మీకు తెలియని విషయాలు అబద్ధమని కొట్టిపారేసి "మనస్సు" ను బందీ చేయకండి.

☛ మీ జీవితానికి మీరే హీరో. మీరే విలన్. మీ మనస్సే యుద్ధభూమి. భావోద్వేగాలే ఆయుధాలు. మీ బుద్ధి వ్యూహ రచనచేసే మంత్రి. మీ గురించి చిలవలుపలవలుగా గొప్పలు చెప్పే వందిమాగదులే మీ అహంకారం. మీ చిత్తమే మీరు ఉత్పన్నం చేసి దాచుకున్న బావోద్వేగాల భాండాగారం. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారాలనే నాలుగు అంత:కరణాలను ఏ విధంగా ఉపయోగించుకోగలుగుతున్నారనే మీ దృక్పధమే – మీరు రాజులా జీవించాలా లేక తరాజులా జీవించాలా అనేది నిర్ణయిస్తుంది. అంటే మామూలు పరిభాషలో చెప్పాలంటే "దృక్పధమే" విజయానికీ, అపజయానికీ కారణమవుతుంది. నాణ్యవంతమైన "దృక్పధం" కేవలం సత్వగుణం వలనే అభివృద్ధి చెందుతుంది. సత్వగుణం యొక్క ప్రాముఖ్యత కర్మజ్ఞానం వలన బోధపడుతుంది.

☛ ప్రపంచంలో ఉన్న రచయితలు, మత ప్రవక్తలు, జ్ఞాన గురువులు అందరూ ముక్త కంఠంతో "ప్రతికూల ఆలోచనలు" మంచివి కావని మాత్రమే చెబుతారు. కానీ మొత్తం సానుకూల ఆలోచనలతోనూ, సాత్విక భావాలతోనూ ఉండే సదుపాయం సృష్టిలో ఏ మనిషికీ లేదనే నిజం "కర్మజ్ఞానం" ద్వారా మాత్రమే మీరు తెలుసుకుంటారు.





☛ "కర్మ సిద్ధాంతం" గురించి తెలుసుకోవటం ద్వారా మీ గురించి మీరు సవ్యంగా స్పష్టంగా అర్ధం చేసుకుంటారు. అప్పుడు మీ అంతర్గత శక్తిని తక్కువగానో, ఎక్కువగానో గాక సమంగా అంచనా వేసుకోగల్గుతారు. అప్పుడు ఒక పుస్తకం చదివినా, ఒక సినిమా చూసినా, ఒక కొత్త వ్యక్తి పరిచయమైనా, మీరు ఎంచుకున్న "లక్ష్యం" చేరటానికి ఏ విధంగా ఉపయోగపడుతుందనే విషయం చక్కగా గ్రహిస్తారు. ఇక దాగుడుమూతలాడుతున్న విజయం దాక్కోవటం మానేసి మీ ముందుకు వస్తుంది.

☛ కర్మ జ్ఞానానికి సంబంధించిన ఏ సమాచారం ఏ రూపంలో మీకు అందుబాటులోకి వచ్చినా, మీ జీవితంలో అప్పటివరకూ లేని ఒక కొత్త మార్పు ప్రవేశించిందని అర్ధం. ఇదే శుభారంభం. [శుభారంభం (కర్మ సిద్ధాంత పరిచయం) పుస్తకం తప్పకుండా చదవండి]. ఈత నేర్చుకునే రోజుల్లో నీళ్లల్లో కాళ్లు చేతులు తప తప కొట్టుకుంటూ ఏ విధంగా తీవ్ర ప్రయత్నం చేస్తామో అదే విధంగా ఒకసారి కర్మజ్ఞానం పరిచయమయ్యాక, ఎవరైనా దీన్ని జీర్ణించుకోవటానికే ప్రయత్నిస్తారు.

☛ ఒక గొప్ప మంచికాలం మీ ముందు ఉన్నది. అది మీకు స్వాగతం చెప్పేందుకు ముందుగా తన ప్రతినిధిగా ఈ పుస్తకాన్ని పంపించిందని విశ్వసించండి.

---:::---

## ప్రయాణం మొదలైంది

పాఠకులారా! మన ప్రయాణం మొదలైంది. ఈ ప్రయాణంలో నన్ను మీరు గైడుగా నియమించుకున్నారు. సాధ్యమైనంతవరకూ మీకు ఆసక్తి ఉండే విధంగా అన్నీ వివరించి చెబుతాను. మన ప్రయాణం విజయవంతం గావాలంటే మీరు కాసింత ఓర్పుగా నాతో సహకరించవలసి ఉంటుంది. ఎందుకంటే కథలు, కబుర్లు నేను చెప్పబోవటం లేదు. కీలకమైన కర్మజ్ఞానం గురించి వివరించి, విజయ రహస్యం వెల్లడి చేయబోతున్నాను.

ఆది మానవుడి నుండి నేటి వరకు జరిగిన చరిత్ర పరిణామ క్రమం పరిశీలించినట్లయితే, ఎన్నో వింతలు విశేషాలు, అద్భుతాలు ఒకవైపు; ఈర్ష్యాద్వేషాలు, అహంకారాలు ఆడంబరాలు మొదలైన ప్రతికూల బావోద్వేగాలు మరోవైపు బుద్ధి జీవులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూనే ఉన్నాయి. రైలు, బస్సు, విమానం, ఫోన్, టి.వి., ఇంటర్నెట్ లాంటి అద్భుతాలు సృష్టించిన మనిషి ఈనాడు ఎంతగా ఎదిగాడంటే అచ్చు గుద్దినట్లు తనలాగే ఉండి అన్ని పనులు మనిషిలా చేయగల రోబోను సృష్టించాడు. మరో పక్క మనిషిలో దాగున్న చీకటి కోణాలను నిజం చేస్తూ విధ్వంసకరమైన అణుబాంబులు, వాటి తాలూకు "పీడకల" లా రెండో ప్రపంచయుద్ధం నాటి హీరోషిమా, నాగసాకీల విషాదాంతం కనిపిస్తూనే ఉంది.

మనిషి తయారు చేసిన రోబో కూడా తెలివి మీరి బావోద్వేగాలకు లోనయి, తనను సృష్టించిన మనిషిని లెక్క చేయక అతన్ని చంపాలనుకునే





ఇతివృత్తంతో వచ్చిన రోబో సినిమా మీరు చూసే ఉంటారు. రోబో మనిషికంటె తానే గొప్పగా భ్రమించి, తానే ఇంత తెలివిగా ఉంటే, తనను తయారు చేసిన మనిషి ఇంకెంత తెలివిగలవాడయి ఉంటాడనే కనీస జ్ఞానం విస్మరించి, మనిషిని మించిపోవాలని ఆశపడి భంగపడుతుంది సినిమాలోని రోబో.

సరిగ్గా ఈ విధంగానే విశ్వంలో పిపీలికం లాంటి మనిషి వరద, ఉప్పెన, సునామి, భూకంపం లాంటి ప్రకృతి విధ్వంసాలలో సాటి మనుషులు రెప్ప పాటులో సజీవ సమాధిగావటం కన్నులారా చూస్తూకూడా, తాను సృష్టించిన వస్తువులను అభివృద్ధిని చూసి గర్వపడుతూ, తానేమైనా చేయగలనని విర్రవీగుతున్నాడు. నిజం చెప్పాలంటే గాలి, నీరు, నిప్పు, మట్టి, ఆకాశం మొదలైన పంచభూతాల కలయికతో ఉన్న ఈ విశ్వంలో నవగ్రహాల చలనం, భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరగటం, ఋతువుల ప్రకారం వర్షాలు, ఎండ, చలితో పాటు తదణుగుణంగా ఫల పుష్పాదులు అభివృద్ధి చెందటం, వ్యవసాయోత్పత్తితో పాటు ***"నూతన వస్తువులు సృష్టించి వినియోగించుకునే అద్భుతశక్తి" మనిషి మేధస్సు నుండి పుట్టించటం కూడా ఈ విశ్వసృష్టిలో అంతర్భాగమని గ్రహించాలి.*** ఇది విస్మరించి మనిషికంటే తాను గొప్పని రోబో అనుకున్నట్టే, మనిషి తనకు తాను అలవి మీరిన గొప్పతనం ఆపాదించుకుంటున్నాడు. "అహంకారం" అనేది మనిషియొక్క సూక్ష్మ శరీరంలోని అంత:కరణాలలో ఒక బాగమైనందున, స్థాయిని బట్టి అహంకారం పెరుగుతూనే ఉంది. "సైన్సు" ఎంతో అభివృద్ధి చెందినది అని గర్వంగాను పటాటోపంగాను చెబుతున్న

మనిషియొక్క పుట్టుక, పెరుగుదల, మరణం మొత్తం విశ్వంలోని కర్మ సిద్ధాంతం (ఇదికూడా సైన్సే, నిజం చెప్పాలంటే అన్నింటినీ మించిన సైన్సు) పరిధికి అతీతం కాదని గ్రహించగల్గితే, ఈ భూమ్మీద ఉన్న నాలుగు రోజులూ మనిషి సంతోషంగా ఉండగలుగుతాడు.

ఈ భూమ్మీద ఉన్న సమస్త ప్రాణులకూ, మనిషికీ ఉన్న ప్రధాన వ్యత్యాసం మిగిలిన ప్రాణులకు లేని ఆలోచించగల బుద్ధి మనిషికి మాత్రమే ఉండటం. మీరు ఈ పుస్తకం చదువుతున్న సమయంలో ప్రపంచంలో ఉన్న కోట్లాది మంది మనుషులు ఏదో ఒక పనికివచ్చే పనో లేదా పనికిమాలిన పనో చేస్తూ ఉంటారు. కానీ ఈ పని చేయటానికి ముందు వారంతా ఇప్పుడు చేస్తున్న పని తాలూకు ఆలోచన చేసి, పిమ్మట ఆ వచ్చిన ఆలోచన క్రియగా అమలు పెట్టే విషయంలో వారంతా బిజీగా ఉన్నారు. మీరు కూడా ఈ పుస్తకం చదవకముందు "పుస్తకం చదవాలని" ఆలోచించే ఉంటారు. కొంచెం తార్కికంగా ఆలోచిస్తే ఇదంతా మీకు టి.వి. లో దృశ్యంలా కనబడుతుంది. ఇప్పుడు ఇంట్లో మీ శ్రీమతి కూరగాయులు తరుగుతుండవచ్చును. కానీ దీనికి ముందు ఆమెకు ఖశ్చితంగా "కూరగాయలు" తరగటం గురించి ఆలోచన వచ్చిందని మనం నమ్మ వచ్చును గదా! ఇక్కడ కీలకమైన విషయం ఏమంటే, మనిషికి వచ్చే వేలాది ఆలోచనలన్నీ కార్యరూపం దాల్చకపోవచ్చును. కార్యరూపం దాల్చిన పనులన్నింటి వెనుక, ఆ పని తాలూకు ఆలోచన ఖశ్చితంగా ఉంటుంది. అంటే ఆలోచనలు విత్తనాలు అనుకుంటే, పనులన్నీ మొలకెత్తిన విత్తనాలుగా భావించ వచ్చును. అయితే "విజయం" గురించి మాట్లాడే రచయితలు, ఉపన్యాసకులు అందరూ చెప్పే పాఠాలను అనువదిస్తే వచ్చే మొత్తం





సారాంశం ఒక్కటే. ఆలోచనలను మార్చుకుంటే "విజయం" సులభసాధ్యమని లేదా విజయానికి ఉపయోగపడే కొన్ని మంచి ఆలోచనలను వారు చెబుతారు. విజయం గురించి మాట్లాడే రచయితలు, ఉపన్యాసకులు తమ "ఆలోచనాదోరణి" ని బట్టి విజయాలకు మార్గాలు చెబుతారు. వారు అనభవంతో చెప్పే విషయాలను ఆమోదించవలసిందే!

కాని ఎవరికైనా "ఆలోచనలు" మార్చుకోవటం గాని గురువులైన ఉపన్యాసకులు చెప్పే కొత్త ఆలోచనలు అమలు చేయటం గాని అనుకున్నంత సులభంగాదు. పుస్తకాలు ఉపన్యాసాల ప్రభావం తాత్కాలికంగా ఉంటుందే తప్ప, స్థిరంగా నిరంతరం కొనసాగదు. విజయ సూత్రాలు చెప్పే చాలా మంది వక్తలు ప్రధానంగా సమర్ధత, తెలివి, లౌక్యం, సమయస్ఫూర్తి, నిరంతర కృషి, సానుకూల ఆలోచనలు, క్రమశిక్షణ, మాటకారితనం, నవ్వుముఖంతో సౌమ్యంగా కనిపించటం......ఇలాంటి వెన్నో చెబుతారు. వీటినిబట్టి గెలుపు ఉంటుందని తమ నమ్మకాలను వ్యాప్తి చేస్తారు. విద్యలు, గుణ గణాలు ఏవైనా కాలానికి సంబంధించి గుర్తింపబడేవేగానీ, వాటికి స్వయం ప్రతిపత్తి ఎంతమాత్రం లేదు. కర్మజ్ఞానం అవగతమయ్యాక ఈ వ్యాఖ్యాలలోని నిజం మీరు గ్రహిస్తారు. ఈ పుస్తకం చదువుతున్న ఉపన్యాసకులు, రచయితలు కూడా బాల్యనుండి తమ ఆలోచనలు ఒక నిర్దుష్టమైన గమనానికి లోబడి సంచరించినట్లు అర్ధం చేసుకోగల్గుతారు. అంటే వారి విజయం వెనుక వారికి కూడా తెలియని ఒక కొత్త అంశం ఉందని అర్ధం.

అదే ప్రారబ్ధకర్మ. ప్రారబ్ధకర్మ కారణంగా మన జన్మ ఏర్పడింది.

అంటే తల్లిదండ్రులు, తోబుట్టువులు, పుట్టిన ప్రదేశం, కుటుంబ పరిస్థితులు, మనం పెంచబడిన పరిసరాలు, మనకు తినబెట్టిన ఆహారపానీయాలు, మనకు నేర్పించిన అలవాట్లు, నమ్మకాలు, భయాలు- ఏవీ మన చేతుల్లో లేవు. ఊహ తెలియని నాటినుండి మన వ్యక్తిత్వ నిర్మాణం మీద మనకు ఏమాత్రం అదుపులేదు. కాస్త బుద్ధి వికసించి విషయాలు అర్థమయ్యేసరికి, పెళ్లి పిల్లలు వెరసి సగం జీవితం తెల్లారిపోతుంది.

మన జీవితం మన ఎంపిక అనేది లేకుండా పాతిక సంవత్సరాలు గడిచిపోయి, స్వీయ అనుభావాల ముద్రలు, బాల్య స్మృతులు, ఒకవేళ వైఫల్యాలు చవిచూసి ఉంటే వాటి తాలూకు జ్ఞాపకాలు మనసు మీద తప్పకుండా ఉంటాయి. మరి అలాంటప్పుడు మీ స్వీయ అనుభవాన్ని కాదని, చెరిపేసి రచయితలు, ఉపన్యాసకులు చెప్పిన సూత్రాలను మీ మనస్సులో ఎలా ముద్రించగలరు? ఎవరికైనా జీవితంలో మంచి మార్పు రావాలంటే తనను తాను సవ్యంగా అర్థం చేసుకోవాలి. ఆలోచనలకు మూలాలు ఏమిటో అధ్యయనం చేయాలి. అప్పుడే జీవితంలో జరిగిన అంతుబట్టని సంఘటనలను సవ్యంగా అర్థం చేసుకోగల్గుతారు. ఇదంతా కర్మ సిద్ధాంతం సంపూర్ణంగా వంటబట్టించుకుని, గణిత సూత్రాల్లా స్వయంగా పరిశీలించుకుని, స్వంత జీవిత పుటల్లోని సంఘటనలతో సరిపోల్చుకున్న తర్వాత మీరే అవునంటారు. కర్మజ్ఞానం ఉంటే విజయం సులభసాధ్యమని, విజయం అంటే మీరనుకుంటున్న అర్థంగాదని, నిజమైన విజయం ఏమిటో మీరు స్వయంగా అనుభూతి చెందుతారు.

కర్మజ్ఞానం తెలియకుండా వ్యక్తిత్వ వికాస పుస్తకాలు వందలు





చదివినా, విజయానికి మార్గాల గురించి ఎన్ని ఉపన్యాసాలు విన్నా, ఆయా రచయితలు, ఉపన్యాసకులు తమయొక్క చాతుర్యంతో ఆ కాస్త సమయమూ మిమ్మల్ని అలరించగలరేమో గాని విజయానికి మార్గం లేదా విజయం సాధించటమనే ప్రక్రియలు ఎవరికి వారు స్వీయ అన్వేషణతో సమకూర్చుకోగల్గినవే. ఈ లోకంలో ఎవరూ ఎవరిని ఆసాంతం మార్చగలిగిలేరు. అసలెందుకు మారాలి? మరి ఫలానా పుస్తకం వలన మా జీవితంలో చాలా మార్పు వచ్చింది – అని ఎవరైనా చెబుతున్నారంటే ఒకటే అర్థం. ***వారు తమను తాము మార్చుకునే "ప్రహసనం" లో ఎప్పటినుండో ఉన్నారని, ఆ పరిణామ క్రమంలో భాగంగా ఆ పుస్తకం చదివి అందులోని కొన్ని అంశాలకు అనుసంధానమయ్యారని (కనెక్టయ్యారని) అర్థం చేసుకోవాలి.*** ఆ పుస్తకం రాసిన రచయిత తన "కర్మ" తాను నిర్వర్తించాడని ఉపన్యాసకుడు కూడా తాను ఎంచుకున్న వృత్తి మార్గంలో తన విధిని నిర్వర్తిస్తున్నాడని అర్థం. కాని "కర్మజ్ఞానం" వలన ఏది, ఎవరు, ఎక్కడ, ఏమిటి, ఎలా అని స్పష్టంగా అర్థమవుతుంది. అప్పుడు కూడా అంటే కర్మజ్ఞానం తెలిసినంత మాత్రాన "మారాలని" రూలు గాని, "మారతారని" గాని గ్యారంటీ గాని ఏమీ లేదు. కాని తమ గురించి తాము స్పష్టంగా తెలుసుకోగల్గుతారు. అప్పుడు ప్రధాన భోజనంలో అధరువుల్లాగా అనేక పుస్తకాలు, ప్రవచనాలు ఉపయోగపడి సాధకుడి జ్ఞానతృష్ణను ఎంతోకొంత తీర్చగల్గుతాయి.

కర్మజ్ఞానం గురించి వివరిస్తున్న ఈ పుస్తకంలో నేను ఇంతకుముందు రాసిన "మానవ సంబంధాలు-మాయా బంధాలు" మరియు "శుభారంభం" పుస్తకాలలోని కొన్ని అంశాలు మరలా ఇక్కడ

కూడా తప్పనిసరయి ప్రస్తావించటం జరిగింది. ఆ పుస్తకాలు చదివిన వారికి "పునరుక్తి" లా అన్పించినప్పటికీ ఆ రెండు పుస్తకాలు చదవకుండా డైరెక్టుగా ఈ పుస్తకం చదివే వారికి అగమ్యం గా ఉన్నట్లు అన్పించగూడదని, కొన్ని అనివార్యమైన విషయాలు మరలా ఇక్కడ వివరించాను.

★★★★★

ప్రపంచంలోని మనుషులందరూ చూడటానికి ఆకారాలు ఒకేలా కన్పిస్తున్నప్పటికీ, కంటికి కనిపించని అనేక వ్యత్యాసాలు ప్రతి ఇద్దరిమధ్య ఉన్నాయి. వేరు వేరు కాలంలో జన్మించటం వలన వయస్సులో వ్యత్యాసంతో పాటు ఆలోచనలలో వ్యత్యాసం, భావాలలో వ్యత్యాసం, ఉద్వేగాలలో వ్యత్యాసం, పరిణితిలో వ్యత్యాసం, విద్వత్తులో వ్యత్యాసం, తెలివిలో వ్యత్యాసం, విద్యా సంస్కారాలలో వ్యత్యాసం...... ఇలా అనేక విధాలుగా ఎన్ని కోట్ల జనాభా ఉన్నప్పటికీ ఎవరికి వారు విభిన్నమైన వారే! తమ తమ కర్మ ఫలాలు అనుభవించటానికి గతంలో అనేక జన్మలు తీసుకుంటూ ఈ భూమ్మీదకు వచ్చిన జీవాత్మలు వారి వారి ఋణానుబంధాల కారణంగా ఇక్కడ సంబంధ బాంధవ్యాలు పెంచుకుంటున్నారు. ముఖ్యంగా గత జన్మ తాలూకు జ్ఞానాభివృద్ధి, పాపపుణ్యాలు ఈ జన్మకు బదిలీ అవటం వలన ప్రతి ఇద్దరి మధ్య ఎన్నో విధాలుగా వ్యత్యాసముంటుంది. అంటే మనషుల మధ్య హెచ్చు తగ్గులు, ఆర్థిక అసమానతలు, ప్రేమ ద్వేషాలు, జయాపజయాలకు కారణం ప్రధానంగా ప్రారబ్ధకర్మే! ఈ విషయం లోతుగా అధ్యయనం చేయకుండా, తూచ్ మూఢ నమ్మకమని ఏవగించుకుని అల్లు అర్జున్ లాగా హీరో అవ్వాలని, చంద్రబాబు లాగా సి.యం. అవ్వాలని,





సచిన్ లాగా క్రీడాకారుడు కావాలని, జ్యోతిర్మయి లాగా గాయని కావాలని, యండమూరి లాగా రచయిత అవ్వాలని..... నేల విడిచి సాము చేస్తూ విజయం కోసం అతకని, అవగతం గాని నానావిధ ప్రయత్నాలు ఎన్ని చేసినా, పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా ఉంటుంది గాని విజయం సాధ్యపడదు. వారి సాత్విక పుణ్య కర్మల కారణంగా "విశ్వం" వారిని సినీ హీరోగా, మంత్రిగా, క్రీడా కారునిగా, గాయకునిగా, రచయితగా దీవించి అనుగ్రహించింది. ఇదేదో కాశీ మజిలి కథ లా అన్పించవచ్చు. ఏదైనా ఒక కొత్త విషయం మనం మొదటిసారి విన్నప్పుడు నమ్మశక్యంగా ఉండదు. కాని మనం పుట్టి పెరుగుతున్న క్రమంలో ఇప్పటికే మీకు అనేక నమ్మశక్యంగాని అద్భుతాలు అనుభవంలోకి వచ్చాయి. మీరు వాడుతున్న "స్మార్ట్‌ఫోన్" అలాంటి అద్భుత అనభవమేగా! అందుకని తెలియని విషయాలు తెలిసినట్లు నటించటం లేదా మనకు తెలియనంతమాత్రాన అబద్ధమని అపనమ్మకంతో కొట్టి పారేయకుండా, నెమ్మదిగా ఉండి తెలుసుకుని సంతృప్తి చెందాక విశ్వసించవచ్చును. జ్ఞానాన్వేషకులు ఆచరించవలసిన ఉత్తమ మార్గమిది. ఇదంతా "కర్మ సిద్ధాంతం" అంటే ఏమిటో తెలుసుకుని, మరొకరితో సంబంధం లేకుండా మీ జీవితంలోని అనేక సంఘటనలు, మీ చర్యలు, పర్యవసానాలు పరిశీలించుకుంటూ, బాల్యం నుండి ఇప్పటికి వరకు మీ ఆలోచనాసరళి, భావాల సమగ్ర స్వరూపం అవగతం చేసుకుని "నిజమని" మీరే గ్రహిస్తారు.

మొదటి మజిలీకి చేరుకున్నాం

జన్మలు, కర్మలు, ఋణానుబంధాలు, పాపపుణ్యాలు–ఇలాంటిభాష, వీటి తాలూకు భావం చాలా మందికి కొరుకుడు పడదు. కొంత మందేమో ఇది చదవటానికి, వింటానికి రిటైర్మెంటు వయస్సు దాటాలన్నట్టుగా మాట్లాడతారు. మరికొంత మందేమో తెలిసి తెలియకుండా ఇవన్నీ మూఢ నమ్మకాలని దుష్ప్రచారం చేస్తారు. నమ్మే వారిని, నమ్మని వారిని, పూజించే వారిని పరిహసించేవారిని ఎవరినీ "కర్మ" వదలదు. కర్మ సిద్ధాంతం ఒక ప్రాకృతిక నియమం.

ఈ శతాబ్ధకాలంలో మనం బైకు, కారు, బస్సు, లారి మొదలైన పలు మోటారు వాహనాలను వినియోగిస్తూ "ఆటో మొబైల్ పరిశ్రమ" ను ఎంతగానో అభివృద్ధి చేసుకున్నాం. అందువలన ప్రపంచంలో మొత్తం మీద కోట్లాది మంది మనషులతో పాటు కోట్లాది వాహనాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ వాహనాలు ఉత్పత్తి చేస్తున్న కర్మాగారం నుండి వినియోగదారుడిని చేరేవరకు వివిధ స్థాయిలలో ఎంతో మంది శ్రామికులు ఉపాధి పొందుచున్నారు. ఈ వాహనాలతో పాటు వీటికి ఉపయోగపడే విడి భాగాల పరికరాలు తయారు చేసే కర్మాగారాలు తద్వారా అందులో కూడా కోట్లాది మందికి ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ఉపాధి లభించింది. ఈ కారణాలవలన భూమ్మీద నివశిస్తున్న మనుషులందరికీ స్వంత వాహనాలు లేక పోయినా, రోడ్డుమీద తిరుగుచున్న వాహనాలను మరియు వాటి చోదకులను బాహాటంగా గమనిస్తున్న ప్రజలకు, వాహనాలకు ఉపయోగపడే ఇంజను, బాడి, టైర్లు, లైట్లు, యాక్సిలేటరు, బ్రేకులాంటి పరికరాలను వీటి ద్వారా మోటారు వాహనం ముందుకు పరిగెత్తటం ఒక అద్భుత అసంగత దృష్టితో గాక, సాధారణ దృష్టితో "ఇందులో ఏముంది





మామూలేగా" అని భావిస్తున్నారు. వీటి గురించి రాస్తున్న నన్ను కూడా ఎందుకిలా ఈ రచయిత చాలా మమూలు విషయాలు ప్రస్తావిస్తున్నాడు – అన్పించవచ్చును. అదే విధంగా వినియోగం ఎక్కువైన "సెల్‌ఫోన్" ను ఇంట్లో తిరిగే పిల్లి పిల్ల లేదా విధిలో తిరిగే కుక్క పిల్లలాగా సర్వ సాధారణంగా చూస్తున్నారుగాని, ఒక "మాయాజాలం" అందరికీ అందుబాటులోకి వచ్చిందని; ఆ కారణంగా "నమ్మకం" వాడుకలో తీవ్రమయి "మామూలేగా" అన్నంత మామూలైందని మీరు అర్ధం చేసుకోవాలి.

ఇక ఇప్పుడు జన్మలు, కర్మలు, ఋణానుబంధాలు, పాప పుణ్యాలు– వీటిని కూడా మనుషులంతా పిల్లల పెంపకంలో ఏ విధంగా స్వీయ పరిశుభ్రత నేర్పిస్తున్నారో ఆ విధంగా పుట్టిన ప్రతి శిషువుకూ శైశవ దశ నుండి ఉగ్గు బాలలో రంగరించి తమ సంతానానికి అందించినట్లయితే, వీటి పట్ల అందరకీ అవగాహన కలగటమేగాక "మూఢనమ్మకమనే" మూఢపు ఆలోచన సమాజం నుండి సమూలంగా తుడిచిపెట్టుకుపోతుంది.

పాఠకులారా, నా ఉద్దేశం ఏమంటే మోటారు వాహనం వినియోగించటం వలన అది నడవటం; సెల్‌ఫోన్ వాడకం వలన అది పని చేసే తీరు మీకు అద్భుతమని గాని, అపనమ్మకని గాని, మూఢనమ్మకమని గాని అన్పించటం లేదు. అదే విధంగా విరివిగా వినియోగంలోకి తెచ్చుకుంటే కర్మజ్ఞానం వీటన్నింటికంటే ఎన్నోరెట్లు అద్భుతమైన విషయమైనా "మామూలు" విషయమేగా అన్నంతగా అలవాటయి అనుభూతి చెందుతారు. చతుర్విధ పురుషార్ధాలలోని అర్ధకామాలనే లక్ష్యాలు నెరవేరటానికి మన స్థూల శరీరానికి సంబంధించిన "కంటి" కి కన్పించే

విధంగా ఉపయోగపడుతున్నాయి గావున కారు, సెల్‌ఫోన్, లాప్‌టాప్, ఇంటర్‌నెట్ లాంటి బాహ్య వస్తువులన్నీ మిక్కిలి ప్రజాధరణ పొందాయి. పైగా వీటి వినియోగానికి విద్య, పాండిత్యాలతో పనిలేదు సరికదా కనీసం అక్షర జ్ఞానం లేనివారు సైతం సాదారణ అవగాహన ద్వారా ఉపయోగించుకోగలుగుతున్నారు. ఇలాంటి భౌతిక వస్తువులు సేకరించుకోవటానికి (కొనుగోలు చేయటానికి) తగిన ఆర్ధిక స్థోమత లేకపోయినా ఇతరులు ఎవరైనా కానుకలుగా ఆయాచితంగా ఇస్తే ఎవరైనా ఉపయోగించుకునే వీలుంది.

***కాని "కర్మజ్ఞానం" కంటికి కనిపించేది కాదు. అక్షరాభ్యాసం లేకుండా పదాలు, వాఖ్యాలు చదవలేనట్లు కేవలం అర్హతనుబట్టి అంచలంచలుగా తీవ్రకృషి ద్వారా మాత్రమే "కర్మజ్ఞానం" ఎవరికి వారు తమ యొక్క సూక్ష్మ శరీరానికి చెందిన నాలుగు అంత:కరణాల ద్వారా అవగతం చేసుకుంటారు. ఈ అర్హతను ప్రతిజీవికీ "విశ్వం" కాలానుగుణంగా నిర్ణయిస్తుంది.***

"కర్మసిద్ధాంతం" యొక్క ప్రాథమిక నిర్వచనం తెలిసినంత మాత్రాన కర్మ గురించి పూర్తిగా తెలిసినట్లు గాదు. "యూ ట్యూబ్" లో వాక్ చాతుర్యమున్న పెద్దాయన యొక్క పురాణప్రవచనం విని, అనుసంధానమయిన (కనెక్టయిన) వారు ఏ విధంగా సంతోషం పొందుచున్నారో అదే విధంగా అల్లు అర్జున్ "సరైనోడు" సినిమా చూసిన సదరు ప్రేక్షకులు కూడా గొప్ప అనుభూతికి లోనవుతున్నారని, ఒకదానికంటే మరొకటి ఏ విధంగాను ఎక్కువ కాదనే విషయం కేవలం "కర్మజ్ఞానం"





వలన మాత్రమే బోధపడుతుంది. ఈ ఆచారాలు సాంప్రదాయాలు, నీతి నియమాలు, సంస్కృతి ఆయా కాలానికి ఆ కాలంలో ఉండే జీవుల జీవనానికి మాత్రమే పరిమితమైనవి.

విద్వత్తు, కళా కౌశలం, ఐశ్వర్యం, ఆడంబరాలు, కీర్తి ప్రతిష్టలు– ఇవన్నీ వాటిని కోరుకుని జన్మించిన వారి మనోగతంలో ముందుగానే నిక్షిప్తంచేయబడిన (ప్రోగ్రామింగ్) అంశాలే గాని, వాటికి ఎటువంటి గొప్పతనం లేదు. అంతా కాలమహిమ. ఆయా వ్యక్తులు వారివారి పాప పుణ్యాల ననుసరించి సుఖదు:ఖాలభ్రాంతికి లోనవుతారు. సంఘటనలకు ఎటువంటి ప్రాదాన్యత లేదని, వాటికి 'మనం' ఏ విధంగా స్పందిస్తున్నామనే విషయాన్ని బట్టి 'వేదన' ఉంటుందని విజ్ఞులు చెబుతారు. ***కాని స్పందించే తీరు తెన్నులు సహితం 'కర్మ' కు లోబడి ఉంటుందని, ఈ విషయంలో మనకున్న 'స్వేఛ్ఛ' పరమితమైనదని మీ అందరూ అర్ధం చేసుకోవాలి. అంటే ఆయా కాలంలో ముందుగా నిర్దేశింపబడిన సంఘటనలు, నిర్దేశింపబడిన ఆలోచనలు, స్పందనలు, అంతా కాల మహిమ.***

'కాలం' యొక్క గొప్పతనం గురించి మీరు అంగీకరించి అర్థం చేసుకోగల ఒక ఉదాహరణ చెబుతాను. స్వర్గస్థుడైన ఒక సీనియర్ నటుడు మూడు దశాబ్ధాల క్రితం చాలా సినిమాలలో నటించి డబ్బుతో పాటు మంచి కీర్తిప్రతిష్టలు సంపాదించాడు. ఆయా చిత్రాలు అప్పట్లో ఎంతో ప్రజాదరణ పొందాయనటంలో ఎటువంటి సందేహం లేదు. కాని అంతటి గొప్ప సినిమాలు ఈ రోజు 'యూ టూబ్' లో ఉచితంగా వీక్షించే సౌలభ్యం ఉన్నప్పటికీ ఎక్కువ మంది చూడటం లేదని, అక్కడ ఉదహరింపబడిన

వీక్షకుల సంఖ్య తెలియజేస్తుంది. పోనీ ఇప్పటితరం వేరు, ఈ తరం వారి అభిరుచి వేరనుకుందాం. ఆ రోజుల్లో ఎవరైతే ఆ సినిమా చూసి 'ఆహా.. ఓహో...'అనుకున్నారో వారికి సైతం ఇప్పుడు ఆ సినిమాలు చూస్తే 'ఏముంది ఈ సినిమాలో' అనే ఒక నిర్లిప్తభావం కనబడుతోంది. ముఖ్యంగా అప్పటికే అరవై ఏళ్లున్న ఆ వృద్ధ హీరో తన ముని మనవరాలి వయసున్న హీరోయిన్‌తో శృంగారం ఒలకబోయటం మరీ ఎబ్బెట్టుగా ఉంటుంది. మరి అవే దృశ్యాలు చూసి ఆనాడు 'శభాష్' అన్న వారే వీరంతా! అంటే సినిమాకు గాని, నటనకు గాని ప్రత్యేకించి గొప్పతనం ఆపాదించలేమని తెలిపోయింది గదా! ఎందుకంటే గొప్పతనం సినిమాది ఐతే, ఆ భావన ఈ రోజు చూసినా కలగాలి. దీన్ని బట్టి గ్రహించాల్సిం దేమంటే, ఆయా నటులనుకున్న 'యోగాన్ని' బట్టి సదరు 'కాలం' ఆ కళాకారులకు డబ్బు మరియు కీర్తి ప్రతిష్టలను కట్టబెట్టింది. మరో రెండు దశాబ్దాలు పోయాక అవే సినిమాలు రేపటి తరం చూసి "పూర్ ఫెలోస్' ఈ సినిమాలని ఆ నాటి జనం చూసేవారట" అని జాలిగా అనుకుంటారని మీకు అర్థం అవుతుంది గదా!

ఈ లెక్కన ఒకనాడు కళాకారులు తోలుబొమ్మలాట ఆడి ఆ 'కాలం' లో డబ్బు, కీర్తి గడించారు. ఆ తర్వాత కళాకారులు నాటకాలాడి ఆ కాలంలో డబ్బు, కీర్తి గడించారు. మూకీల నుండి టాకీ యుగం ప్రారంభమైన తొలినాళ్లలో కాళాకారులు రామారావు, నాగేశ్వరరావు వారికి ఉన్న యోగం కారణంగా ఆ కాలంలో డబ్బు, కీర్తి సంపాదించారు. సినిమా అనే కళారూపం ఈ పుస్తకం రాయబడుతున్న కాలం (2016) వరకు కొనసాగింది. కానీ రాబోయే 'కాలం' లో యోగం ఉన్న కళాకారులు ఏ





కొత్త సాంకేతిక కళారూపం ద్వారా డబ్బు, కీర్తిని సంపాదించనున్నారో మనకు తెలియదు. రామారావు, నాగేశ్వరరావు తెలిసిన చివరి మనషులు కూడా గతించాక, ఒకనాటి తోలుబొమ్మలాటకు ఈనాడు విలువ లేనట్లే వీరు నటించిన సినిమాలకు ఎలాంటి విలువా ఉండదు. పాఠకులారా పుణ్యబలం కారణంగా విశ్వం వారికి కాలం ద్వారా యోగం ప్రసాదించిందని, ఆయా కళారూపాలయొక్క గొప్పతనం అంటూ నిజంగా ఏమీ ఉండదని మీరు అర్థం చేసుకోవాలి.

కర్మ సిద్ధాంతం యొక్క నిర్వచనం అర్థం చేసుకుని ప్రాథమిక స్థితి దాటి, సంఘటనలను జ్ఞానంతో పరిశీలించి సమ దృష్టితో చూడటం అలవాటయ్యాక 'కర్మ' జ్ఞానం కొంచెం కొంచెం బోధపడుతుంది. అప్పుడు దైనందిన జీవితం ఎంతో బాగుందని మీరు స్వయంగా అనుభూతి చెందుతారు. వర్షం రాబోయేముందు 'చల్లగాలి' లా సదరు అనుభూతి ఇప్పటికే మీ మనస్సును తాకినట్లయితే, మీకు నా అభినందనలు

## రెండవ మజిలీకి చేరుకున్నాము